క్లుప్తంగా

12న వేణుగోపాలస్వామి రథోత్సవం

పెదమద్దాలి(పామర్రు): పామర్రు మండలం పెదమద్దాలి గ్రామంలోని ఉద్దండ వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఈ నెల12న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలోని రథశాలలో ఉన్న రథాన్ని ఆదివారం వెలుపలికి తీసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఆలయంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో త్రయాహ్నిక దీక్షతో కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 11వ తేదీన స్వామి కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. 12న ఉత్సవ మూర్తులను రథంపై గ్రామంలో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కె ప్రభాకర్‌రెడ్డి, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

చర్చి నిర్మాణ పనులకు ఆర్థిక సాయం

పమిడిముక్కల: తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న చర్చికి మండలంలోని చోరగుడి గ్రామానికి చెందిన హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు రూ.6 వేలు సాయం అందజేశారు. చర్చి నిర్వాహకులు వేణుకు కృతజ్ఞతలు తెలిపారు. చర్చి నిర్మాణానికి దాతలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: మండలంలోని రౌడీషీటర్లకు గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దొంగతనాలు, గొడవలు, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొండలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వాతావరణం చల్లబడటంతో భక్తులు తమ మొక్కులను చెల్లించుకునేందుకు బారులు తీరారు. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

పెరిగిన ఆలయ ఆదాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయానికి చెందిన చేపల చెరువు వేలం పాట ద్వారా ఆలయానికి ఆదాయం పెరిగినట్లు ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పెయ్యేరులో 10.56 ఎకరాల చేపల చెరువు ఉండగా దీనికి శనివారం వేలం పాటలు నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన హనుమార పేర్నీడు ఎకరానికి ఏడాదికి రూ.69 వేల లీజు చెల్లించేలా పాట పాడుకున్నట్లు తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తోట్లవల్లూరు: కడుపు నొప్పి తాళలేక ఓ వివాహిత కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఐలూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు ఐలూరు గ్రామానికి చెందిన లోయ ఉషాకుమారి(33) గత నెల 30వ తేదీన కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు కుటుంబసభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందింది. వివాహమై 18 ఏళ్లు గడిచినా సంతానం లేకపోవటంతో మానసిక కుంగుబాటు, తరచూ కడుపు నొప్పి వస్తుండటంతో మనస్తాపంతో ఉషాకుమారి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లి కొణతం కోటేశ్వరమ్మ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ అవినాశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- కైకలూరు రైల్వే ట్రాక్‌పై రోజుకు 40 గూడ్స్ రైళ్లు
- ఒక్కో గేటు వద్ద 20 నుంచి 30 నిముషాల నిరీక్షణ

రైల్వే గేట్లు.. ప్రయాణికుల పాట్లు



కైకలూరు: విజయవాడ–నరసాపురం రైల్వే లైన్‌లో విజయవాడ నుంచి నిడదవోలు వరకు ఇటీవల రెండు వరుసల విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. నూతన ట్రాక్ ఏర్పాటుతో కొత్త రైళ్లలో ప్రయాణం సుఖమయమవుతుందని భావించిన ప్రయాణికులకు నిరాశే మిగిలింది. కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, మండవల్లి మండలాల రైతులు, ప్రజలు రైల్వే ట్రాక్‌లను దాటడం పెద్ద ప్రసహనంలా మారింది. కైకలూరు – విజయవాడ – నరసాపురం రూట్‌లో రోజూ తిరిగే 12 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లతో పాటు మరో ఒక రోజు తిరిగే 14 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణిస్తున్నాయి. వీటిలో పాటు రోజూ దాదాపు 30 నుంచి 40 గూడ్స్ రైళ్లు తిప్పుతున్నారు. గతంలో రోజుకు కేవలం రెండు నుంచి మూడు గూడ్స్ రైళ్లు మాత్రమే తిరిగేవి.

మండుటెండలో యాతన

గూడ్స్ రైళ్ల ద్వారా కాకినాడ, విశాఖపట్నం, నరసాపురం, చెన్నై, నెల్లూరు, సికింద్రాబాద్ వంటి పట్టణాలకు బొగ్గు, ఐరన్ ఓర్, జిప్సం, ఐరన్ షీట్స్, ధాన్యం, రైస్ సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలో కైకలూరు, మండవల్లి మండలాల పరిధిలో చిన్నా, పెద్ద గేట్లు కలిపి మొత్తం 16 ఉన్నాయి. వీటిలో కైకలూరు, భైరవపట్నం, చావలిపాడు, కోరుకొల్లు, మండవల్లి, ఆటపాక గేట్లు కీలకం. గేట్లు పడితే 20 నుంచి 30 నిముషాలు వేచి ఉండాల్సి వస్తోంది. ఉదాహరణకు మోటూరులో రైలు ఉంటే భైరవపట్నంలో గేటు మూస్తున్నారు. గూడ్స్ వెళ్లిన తర్వాత కొద్దిసేపు వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కో గూడ్స్ రైల్లో 53 నుంచి 63 బోగీలు ఉంటున్నాయి. ఎండల తీవ్రతతో ప్రయాణికులు మాడుతున్నారు. నియోజకవర్గ సమీప గ్రామాల ప్రజలు పామర్రు – దిగమర్రు (165 జాతీయ రహదారి) రోడ్డుపై నుంచి ఇతర గ్రామాలకు చేరాల్సి ఉంది. ప్రధానంగా ఆయా గ్రామాల నుంచి వచ్చే ప్రభుత్వోద్యోగులు, విద్యార్థులు భీమవరం, ఏలూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లాలి. మరి కొందరు కైకలూరుకు రావాల్సి ఉంటుంది. ఇదే కాకుండా ఆక్వా ఉత్పత్తుల లారీలు తిరుగుతుంటాయి. గూడ్స్ రైళ్లు ఎక్కువగా తిరగడం వల్ల అందరికీ ఆలస్యం అవుతోంది. రైల్వేశాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్వోబీలు నిర్మించాలి



గూడ్స్ రైళ్లు కైకలూరు మీదుగా ఇటీవల ఎక్కువగా తిరుగుతున్నాయి. దీంతో గోపవరం, భైరవపట్నం, కోరుకొల్లు, కలిదిండి వంటి గ్రామాలు చేరడానికి లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఎక్కువ సమయం వాహనదారులు వేచి ఉండాల్సి వస్తోంది. రైల్వే శాఖ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)లు, అండర్‌పాస్‌లు నిర్మించాలి.

– సీహెచ్ శంకరశాస్త్రి, న్యాయవాది, కైకలూరు

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి



ప్రయాణికుల ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించడానికి అండర్‌పాస్‌లు నిర్మించాలి. రైల్వే గేట్ల వద్ద వాహనదారులు వేచి చూడాల్సి వస్తోంది. కైకలూరు రైల్వేస్టేషన్‌లో లిఫ్టుల నిర్మాణం ఆలస్యంగా మారింది. త్వరగా పూర్తి చేయాలి.

– లావేటి వీర శివాజీ, సామాజిక సేవాకర్త, లోకుమూడిగరువు

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



గుడ్లవల్లేరులో భగీరథ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కార్యదర్శి నరసింహారావు



గుడివాడలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులు

గుడ్లవల్లేరు: భగీరథ మహర్షి జయంతిని గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్ర పటానికి గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. గంగానదిని స్వర్గం నుంచి భూమిపైకి తన తపోశక్తి ద్వారా తీసుకొచ్చిన భగీరథ మహర్షి జయంతిని జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందని కార్యదర్శి పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: భగీరథ మహర్షి జయంతి వేడుకలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మురుగునీటి సమస్య లేకుండా చర్యలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పట్టణంలో మురుగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌తో కలిసి ఆదివారం గుడ్‌మెన్ పేట, కోతిబొమ్మ సెంటర్, బస్టాండ్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయం కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలువ ఉండటాన్ని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డ్రెయినేజీ వ్యవస్థపై కొన్నాళ్లుగా దృష్టిపెట్టక పోవడంతో ఈ విధమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయిలో మురుగునీరు నిల్వ చేరకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ సామాజిక సేవకు ముందుకు రావాలి

ముదినేపల్లి రూరల్: గ్రామాల్లోని యువకులు సామాజిక సేవకు ముందుకు రావాలని ఎస్‌ఐ వీఎస్ వీరభద్రరావు అన్నారు. మండలంలోని పెయ్యేరు వైఎస్సార్ కాలనీ వద్ద మొవ్వా కల్యాణ చక్రవర్తి, పవన్ చక్రవర్తి ఆర్థిక సాయంతో నిర్మించిన బస్సు షెల్టర్‌ను ఎస్‌ఐ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రయాణికుల అవస్థను గమనించిన యువకులు బస్సు షెల్టర్‌ను నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాకరం, రుద్రపాక సర్పంచ్‌లు జాస్తి రాజా, జంగం రాజు, పెయ్యేరు మాజీ సర్పంచ్ దుక్కిపాటి శేషుబాబు, మొవ్వా ఫణీంద్ర, బందెల విజయ్‌కుమార్, భూపతి రవీంద్ర, సందీప్‌కుమార్ పాల్గొన్నారు.


■ విద్యుత్ కోత నివారిస్తాం

కైకలూరు: ట్రాన్స్‌కో విద్యుత్ టవర్ కూలడంతో తరచూ విద్యుత్ కోత విధించాల్సి వస్తోందని మరో నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ జీబీ.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండవల్లి మండలం పసలపూడి వద్ద ట్రాన్స్‌కోకు చెందిన 132 కేవీ టవర్ ఇటీవల ఈదురు గాలులకు కుప్పకూలింది. దీని మరమ్మతు పనులను ట్రాన్స్‌కో ఎస్ఈ భాగ్యరాజతో కలసి ఆదివారం పరిశీలించారు.

■ 15 మందికి ఉచిత సున్తీలు

కైకలూరు: స్థానిక బుడా సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 మంది ముస్లిం బాలురకు ట్రస్ట్ చైర్మన్ ఎండీ.గాలిబ్‌బాబు సహకారంతో ఎంపీయూపి ఉర్దూ స్కూల్లో ఆదివారం ఉచిత సున్తీలు చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో బియ్యం, గోధుమ పిండి, నెయ్యి, నూనె, మందులు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ



ఏరువ కోటిరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కైలే అనిల్‌కుమార్



చిన్న వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న అనిల్‌కుమార్

పామర్రు: ఇటీవల మృతి చెందిన, గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబాలను ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కూసం చిన్న వెంకటరెడ్డి కుటుంబాన్ని అనిల్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా ప్రమాదంలో గాయపడిన కూసం సుబ్బారెడ్డిని పరామర్శించారు. పామర్రు పట్టణంలోని ఆషా ఆప్టికల్స్ అధినేత కాలిక్ తల్లి మరణించగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పామర్రు 15వ వార్డులో గత నెల్లో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఏరువ కోటిరెడ్డి దశ దిన కార్యక్రమంలో అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కోటిరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, పామర్రు వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, నందిపాటి సురేష్‌రెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, నవుడు సింహాచలం, ఎం సురేష్‌రెడ్డి, డీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ముదినేపల్లి రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం ఆటల పోటీలు, పుస్తక పఠనం నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో క్యారమ్స్, చదరంగం పోటీలు నిర్వహించారు. పలు రకాల నీతి కథలు బోధించి వాటి సారాంశాన్ని వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. వడాలి శ్రీజగన్నాథ స్వామి ఆలయానికి చెందిన ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

సాంబశివరావుకు డీఎన్నార్ పరామర్శ



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొల్లి సాంబశివరావును పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం పరామర్శించారు. సాంబశివరావు ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. ముదినేపల్లిలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు.

కైకలూరులో..

కైకలూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) వరహాపట్నం గ్రామంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చావలి రజనీకాంత్ తండ్రి వెంకటేశ్వరరావును ఆదివారం పరామర్శించారు. అస్వస్థతకు గురైన వెంకటేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గుడివాడ టౌన్: స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి ప్రజా సమస్యల వేదిక నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జి. బాల సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదికలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బీసీ జనగణన నిర్ణయం హర్షణీయం



తోట్లవల్లూరు: జాతీయ స్థాయిలో బీసీ జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని బీసీ జనగణన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా వెంకట శ్రీనివాసరావు, ఏపీ ఫార్మా అధ్యక్షులు లుక్కా నరేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మండలంలోని రొయ్యూరులో బీసీ నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. సామాజిక సేవకుడు సూరి పవన్‌కుమార్, మోర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనాశక్తిని పెంపొందించుకోవాలి



జమీగొల్వేపల్లిలో శతక పద్యాలను వివరిస్తున్న మాధవి

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులు ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయురాలు ఎస్.మాధవి పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని గ్రంథాలయంలో వేసవిశిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం పద్య పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేమన–సుమతి శతక పద్యాల పఠనంతో జ్ఞాపక శక్తి పెంపొందుతుందన్నారు. పద్య పఠనం, పంచతంత్ర నీతి కథలు వినటం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, ఊహాశక్తి అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా సమాజం పట్ల గౌరవం, బాధ్యత ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు పి.పద్మావతి, గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో సమ్మర్ శిక్షణలో భాగంగా ఆదివారం స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్‌ను సాలా గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

పమిడిముక్కల: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఎంఈఓ–2లకు కూడా పరస్పర బదిలీలకు అనుమతి ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు వైఎస్‌ఎన్ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆదివారం కృష్ణా జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గ సమావేశం జరగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య అందించేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్లస్టర్ పాఠశాలలకు సీఆర్‌ఎంటీ, డిజిటల్ అసిస్టెంట్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేఎస్ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.విజయ్, ఉయ్యూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధులు కనకదుర్గ, పద్మవాణి, సలోమి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గుడివాడలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 364 మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల చినఅవుటపల్లి వైద్యబృందం నేతృత్వంలో 65 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు టి.ఎస్. రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి. కిరణ్‌బాబు, ప్రెసిడెంట్ ఎలక్ట్ వై. నాగేశ్వరరావు, వైద్యులు డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ యోగానంద్ వైద్యబృందం పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం



పామర్రులో కురుస్తున్న వర్షం



మండవల్లిలో ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం

పామర్రు: కొన్ని రోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఆదివారం కురిసిన వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతంగా మారింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఉరుములతో కూడిన వర్షం కురిసింది.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి మండలంలోని మండవల్లి, తదితర గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఇప్పటివరకు ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు అకాల వర్షంతో ఉపశమనం లభించింది. సుమారు గంటపాటుకు గాలులు, భారీ వర్షం రావడంతో ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్న సమయానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: ఈదురుగాలులు, అకాల వర్షంతో అన్నదాతలు అవస్థలకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన వర్షం కొద్ది సేపు కురిసింది. దీంతో గాలుల తీవ్రతకు లంకల్లో మొక్కజొన్న, అరటి పంటలు అక్కడక్కడా నేలవాలాయి. అలాగే కల్లాల్లో ఉన్న ధాన్యం, మొక్కజొన్నను రైతులు పరదాలతో కప్పి రక్షించుకున్నారు. పంట చేతికొచ్చే సమయంలో వస్తున్న అకాలవర్షంతో ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అస్తవ్యస్తంగా రహదారులు



చర్చి వద్ద వర్షం కారణంగా రహదారిపై నిలిచిన నీరు

మండవల్లి: మండలంలోని మూడుతాళ్లపాడు శివారు ఆనందపురంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులకు డ్రెయినేజీ సౌకర్యం లేక రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోతోంది. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులపై వర్షం నిలిచి వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షంతో రోడ్డు మీద నీరు నిలవడంతో ఏలూరు, గుడివాడ తదితర ప్రదేశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. చర్చి వద్ద వర్షం కురిస్తే పరిస్థితి దారుణంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

బయటకు వచ్చే వీలు లేదు

మా గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్న కారణంగా, వర్షం కురిస్తే జిల్లా కేంద్రం ఏలూరు, గుడివాడ, కైకలూరు వంటి పట్టణాలకు వెళ్లడానికి అవస్థలు పడుతున్నాం. వర్షాకాలం ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులు రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

– దానియేలు, ఆనందపురం